



ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు

6

అభయుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు

బిల్లులు వస్తున్నా.. గ్రౌండింగ్ సగమే..!

- ఇంటి నిర్మాణానికి ముందుకురాని ఇందిరమ్మ లబ్ధిదారులు
- ప్రభుత్వ ఆర్థిక సాయానికి మరికొంత జోడించలేక వెనుకంజ
- ప్రతీ సోమవారం ఠంచనుగా లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు
- గ్రౌండింగ్ చేసిన మార్కింగ్ దశలోనే నిలిచిపోతున్న దుస్థితి
- వాటిని ఇతరులకు బదిలీ చేయాలనే డిమాండ్
- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 40,306 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



ఇంటి నిర్మాణానికి చేతిలో డబ్బుల్లేవ్

నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యింది. పునాది వేసుకోవడానికి కూడా డబ్బులు లేవు. రూ.5లక్షలలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేయడం కష్టం. దానికి మరికొంత అప్పు చేయాల్సి వస్తుంది. అందుకే ఇంటి నిర్మాణం చేయలేదు.

- బోయ భాగ్యలక్ష్మి, కొండేరు, ఎర్రవల్లి మండలం



గద్వాల పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

మహబూబ్‌నగర్, నవంబరు15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పేద ప్రజల సొంత కలను నెరవేర్చేందుకు తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అనుకున్నంత వేగంగా ముందుకు సాగడం లేదు. మొదటి విడత కింద మంజూరైన ఇళ్లలో సగంపైగా లబ్ధిదారులు గ్రౌండింగ్ చేసుకోవడం లేదు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రతీ పేదకు మంజూరు చేస్తామని, అందుకు రూ. 5లక్షల వరకు ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం ప్రారంభించి.. అభయహస్తం ద్వారా దరఖాస్తుల స్వీకరణ చేసింది. ఆ తర్వాత సామాజిక, ఆర్థిక, కుల, రాజకీయ సర్వేలో కూడా వివరాలు సేకరించింది. మొదటి విడతగా సొంతస్థలం ఉన్న వారికి ఇళ్లను మంజూరు చేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 40,306 ఇళ్లను మొదటి విడతలో మంజూరు చేసింది. నియోజకవర్గానికి 3500 ఇళ్లను ప్రతీ సంవత్సరం మంజూరు చేస్తామని చెప్పగా.. మొదటి విడతలో మం జూరు చేసిన ఇళ్ల నిర్మాణాలే కొనసాగడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ప్రభుత్వం నుంచి అందిస్తున్న ఆర్థికసాయం సరిపోకపోవడం, అందుకు కొంత లబ్ధిదారుడు జోడించాల్సి స్తుండటంతో వ్యక్తిగత ఆర్థిక ఇబ్బందుల కారణంగా ముందుకు రావడం లేదనేది స్పష్టమవుతోంది. అలాగే ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం, ఇసుక కొరత, బయట దొరికినా ఎక్కువ ధరలు ఉండటం కూడా మరో కారణంగా చెప్పవచ్చు. అలాగే గ్రౌండింగ్ కాకుండా 45శాతం వరకు పెండింగ్ ఉండగా.. గ్రౌండింగ్ చేసి మార్కింగ్ చేసిన వాటిలో కూడా నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఇలా ఇంటి నిర్మాణానికి ముందుకు రాని లబ్ధిదారుల విషయంలో ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందో వేచిచూడాలి. కొంత గడువు విధించి వాటిని రెండో జాబితాకు మళ్లించడమా? అనేది పునరాలోచించాల్సి ఉంటుంది.

ఠంచనుగా బిల్లులు..

వాస్తవానికి ఏ ప్రభుత్వ పథకమైనా.. నిర్మాణమైనా బిల్లులు రావాలంటే చాలా సమయం పడుతుంది. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో ఇంకా సమయం పడుతుంది. కానీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రాధాన్య పథకంగా తీసుకుని ప్రతీ సోమవారం

- మిగతా 6లో..

టూరిజానికే ప్రాధాన్యమా?

- చెంచుల సమస్యలు పట్టించుకోని అటవీశాఖ అధికారులు
- పెంటలకు దారి లేక నరకయాతన
- కనీసం అంబులెన్స్ వెళ్లలేని దుస్థితి
- నిత్యావసరాలు తెచ్చుకోలేక ఇక్కట్లు



కోతకు గురైన మల్లాపూర్ పెంటకు వెళ్లే దారి

7



యూనిటీ మార్చ్‌లో గుజరాత్ ఎంపీ పార్మర్ జశ్వంత్‌సిన్హ్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

యూనిటీ మార్చ్ విజయవంతం

నాగర్‌కర్నూల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన 'యూనిటీ మార్చ్' విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి గుజరాత్ రాజ్యసభ సభ్యుడు పార్మర్ జశ్వంత్‌సిన్హ్, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శనివారం నాగర్ కర్నూల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో సర్దార్ వల్లభాయ్ పటేల్, బిర్సాముండా చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించి ముఖ్య అతిథులు యూనిటీ మార్చ్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, యువతనుద్దేశించి రాజ్యసభ సభ్యుడు పార్మర్ జశ్వంత్‌సిన్హ్ మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలు, అలాగే వందేమాతరం గీతం 150ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు త్రివేణి సంగమం లాంటి కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నట్లు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యువతలో దేశభక్తి పెంపొందించేందుకు ఏక్ భారత్ ఆత్మ నిర్భర్ భారత్ భాగంగా ఐక్యత మార్చ్ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశ సమైక్యతకు ప్రతీక. 536 సంస్థానాలను ఏకం చేసి అఖండ భారతావనిని నిర్మించిన మహనీయుడని అన్నారు. హైదరాబాద్ సంస్థానం విలీనంలో కూడా ఆయన పాత్ర అమోఘమని అన్నారు. అనంతరం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ మహనీయుల ఆశయాలకనుగుణంగా యువతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారి కోటనాయక్, జిల్లా యువజన సర్వీసుల అధికారి సీతారాంనాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, డీఎంహెచ్‌వో రవినాయక్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జ్ఞాన శేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

శివుడిని చుట్టేసిన గంగమ్మ





ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణ సమీపంలోని పరమేశ్వరస్వామి చెరువు జలకళను సంతరించుకున్నది. ఈ చెరువు సమీపంలోని శివాలయంలోకి చేరిన గంగమ్మ శివుడిని చుట్టేసినట్లు కనిపిస్తున్న దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి, ఫొటోగ్రాఫర్, వనపర్తి

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- మిల్లర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి : ఎమ్మెల్యే మేఘారెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దమందడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే మేఘారెడ్డి హెచ్చరించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పామిరెడ్డి పల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మిల్లర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడ ఏలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కొనసాగించాలని సూచించారు. కొనుగోలు కేంద్రం నుంచి రైతులు ధాన్యాన్ని లారీలలోకి ఎత్తిన తరువాత రైతులకు ఎలాంటి సంబంధం ఉండదని, ఏ సమస్య ఉన్నా కొనుగోలు కేంద్రంలోనే పరిష్కరించి ధాన్యాన్ని తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తి స్థాయి వసతులు కల్పించాలని, రైతులను ఇబ్బందలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రమేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, మాజీ సర్పంచు తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- రెండు రోజులుగా పెరిగిన చలి
- అప్రమత్తత అవసరం అంటున్న వైద్యులు



కృష్ణవరంలో పొలం వద్ద చలి కాచుకుంటున్న రైతులు

6

నిరంతర పోరాటమే సీపీఐ చరిత్ర

- జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాల బస్సు జాతా

7

కొనుగోలు కేంద్రం ప్రారంభంలో రసాభాస

- రైతులు దళారులను నమ్మొద్దు
- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

సత్తాచాటిన 'పల్లెటూరి కుర్రాళ్లు'

- పోలీసు అమరవీరుల షార్ట్‌ఫిల్మ్ అవార్డుకు ఎంపిక
- అభినందించిన డీజీపీ, ఎస్పీ

6

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 130.00
హోల్ సేల్	: 139.00
డ్రెస్డ్	: 234.00
స్కిన్ లెస్	: 251.00

న్యుమోనియా వ్యాధిపై..
అప్రమత్తంగా ఉండాలి

- జిల్లాలో 53 డెంగీ కేసుల నమోదు
- డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్యాకిరణ్మయి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గద్వాల న్యూటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో న్యుమోనియా వ్యాధి ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూతనంగా డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన సంధ్యాకిరణ్మయి అన్నారు. వ్యాధి నియంత్రణకు అన్ని నివారణ చర్యలు చేపడుతున్నామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు.

న్యుమోనియా వ్యాధి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

చలికాలంలో ఎక్కువగా ఈ వ్యాధి ప్రబలే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా ఈ వ్యాధి ప్రబలితే ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సకాలంలో వైద్యం అందిస్తున్నాం.

జిల్లాలో డెంగీ కేసులు ఉన్నాయా..?

ప్రస్తుతం డెంగీ వల్ల ప్రజలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాదిలో జోగుళాంబ గద్వాల జిల్లాలో 53 మంది డెంగీ బారిన పడ్డారు.

ప్రజలపై సీజనల్ వ్యాధుల ప్రభావం ఎలా ఉంది..?

ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి సీజనల్ వ్యాధులపై ఫీవర్ సర్వే చేయించాం. జూన్ మాసంలో 578 మంది, జూలైలో 443 మంది, ఆగస్టులో 676 మంది, సెప్టెంబరు 343 మంది, అక్టోబరు 412, మంది సీజనల్ వ్యాధుల బారిన పడ్డారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా..?

ఫీవర్ సర్వేలో ఆశా వర్కర్లకు ఒక్కొక్కరికి 200 ఇళ్ల చొప్పున సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతీరోజు 50 ఇళ్లను సర్వే చేయించి అందులో ఫీవర్‌తో బాధపడుతున్న వారికి మందులు అందిస్తున్నారు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోతే వెంటనే వారిని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్‌లకు పంపించి అక్కడ వైద్యం అందిస్తున్నాం. అక్కడ కూడా నయం కాకపోతే జిల్లా ఆస్పత్రికి పంపిస్తున్నాం.

ఇప్పటి వరకు చికున్‌గున్యా, డెంగీ, మలేరియా బారిన ఎంతమంది పడ్డారు..?

జోగుళాంబ గద్వాల జిల్లాలో చికున్‌గున్యా, మలేరియా కేసులు నమోదు కాలేదు. ఇప్పటి వరకు 53 డెంగీ కేసులు నమోదు అయ్యాయి.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారా..?

వైద్య సిబ్బంది ఇంటింటి (ఫీవర్) సర్వేలో జ్వరం ఉన్న వారి ఇంటి వద్దకు వెళ్లి మందులు ఇస్తున్నారు. గ్రామాల్లో అయితే నలుగురు జ్వరంతో బాధపడుతుంటే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నాం. ఒక డెంగీ కేసు నమోదు అయితే ఆ ఇంటిచుట్టు పక్కల ఉన్న 50 ఇళ్లకు యాంటిలార్వా స్ప్రే చేయిస్తున్నాం. వీలైతే ఆయిల్‌బాల్స్‌ను కూడా వేసి లార్వాలను పూర్తిస్థాయిలో నివారించేలా చర్యలు చేపడుతున్నాం.

మందులు అందుబాటులో ఉన్నాయా..?



జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులలో అన్ని వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయి.. ప్రస్తుతం ఎలాంటి మందుల కొరత లేదు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా..?

సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ శుక్రవారం డ్రైడేను నిర్వహించేలా చూస్తున్నాం. దీనిముఖ్య ఉద్దేశం ఏమిటంటే నీటి తొట్లు, డ్రమ్ముల్లో నిల్వఉన్న నీటిని పారబోసి కొత్తనీరు నింపుకోవడం. ఇలా చేయడం వల్ల దోమ లార్వాలు నశిస్తాయి. దీంతో వ్యాధులు దరిచేరవు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ 9 తెగల జేఏసీ చైర్మన్ రామకృష్ణ

అచ్చంపేటటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి తెగల హక్కులను దోచుకుంటున్న లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ 9 తెగల జేఏసీ చైర్మన్ రామకృష్ణ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో శనివారం భగవాన్ బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివాసీలు భారీ ర్యాలీ తీశారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. బిర్సాముండా మరణించినా ఆయన ఆశయాలు సజీవంగానే ఉంటాయన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వాలు ఆదివాసి గిరిజనుల జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఆదివాసీల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ర్యాలీలో ఉమ్మడి జిల్లా చెంచులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ తెగకు చెందిన గొండు, కోయ, కోలం, కొండారెడ్డి, తోట, అందు, ప్రధాన్, చెంచు తెగల వాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, అంజయ్య, సునిల్ పాల్గొన్నారు.

నేరాల అదుపునకు చర్యలు : ఎస్పీ

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా ఆత్మకూర్ సర్కిల్ కార్యాలయాన్ని శనివారం డీఎస్పీ వెంకటేశ్వర్ రావుతో కలిసి ఆయన తనిఖీలు చేపట్టారు. సర్కిల్ కార్యాలయంలో రికార్డులను, కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల సేవలపై ప్రజలకు నమ్మకం కలిగేవిధంగా మెలగాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయడం బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీఆఎస్‌ఐ తిరుపతిరెడ్డి ఆత్మకూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

అత్యాపత్య క్రీడలకు ప్రాధాన్యం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

6

45 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం

» రూ.కోటిపైగా వెచ్చించి ఏర్పాటు చేయించిన రైతు



ప్రతిష్ఠించిన పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహం

అలంపూరుచౌరస్తా, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని డీ.బుడిదపాడు శివారులో అలంపూరు పుణ్యక్షేత్రానికి వెళ్లే మార్గంలో 45 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. మూడు రోజులుగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం అశేషభక్తజనం నడుమ అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనుబంధంగా శివుడు, పంచముఖి ఆంజనేయస్వామి, సీతరామలక్షణులు, నవబ్రహ్మల విగ్రహాలు ప్రతిష్ఠించారు. మండల కేంద్రానికి చెందిన ఉప్పలపాటి నారాయణరెడ్డి అనే రైతు భూమి లోపల నుంచి 45అడుగుల ఎత్తైన ఆకారంలో నిర్మించిన విగ్రహానికి సుమారు 146టన్నుల స్టీల్, 500టన్నుల సిమెంటు, రెండేళ్ల పాటు రోజుకు 20మంది కార్మికుల సహకారంతో రాజమండ్రికి చెందిన ప్రముఖ శిల్పి నాగరాజు నేతృత్వంలో నిర్మించారు. కాగా దీని రూ.కోటి వరకు ఖర్చు చేసినట్లు రైతు తెలిపారు.

అభయుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉన్న భక్తులు

ఊర్కొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి శనివారం కావడంతో భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయి జై హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. భక్తులు దీపారాధన అనంతరం సాముహిక వ్రతాలు నిర్వహించి అన్నదానం చేశారు. అర్చకులు స్వామివారికి తెల్లవారుజామున అభిషేకంతో పూజలు నిర్వహించి దర్శనం కల్పించారు.

శాస్త్రోక్తంగా శనీశ్వర స్వామి వ్రతాలు



నంది వడ్డెమాన్ శనీశ్వర స్వామి ఆలయంలో వ్రతాలు చేస్తున్న దంపతులు

బిజినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శని గ్రహ ప్రభావం నివారణకు 306 మంది దంపతులు శాస్త్రోక్తంగా శనీశ్వర స్వామి వ్రతాలు చేశారు. మండలంలోని నంది వడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ముందుగా శనీశ్వర స్వామి దర్శనం చేయించి తిల, తైలాభిషేకాలు చేయించారు. అనంతరం శనీశ్వర స్వామి వ్రతాలను వేదమంత్రోచ్చారణలతో, స్వామి ఇతివృత్తం కథలను వివరించారు. భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహే శ్వర్, ఆలయ సిబ్బంది గోపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాజేష్, వీరశేఖరాచారి, ప్రభాకరాచారి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

మత్స్యకారులు భారీగా తరలిరావాలి

» మత్స్యకార సంఘం రాష్ట్ర కార్యదర్శి బయ్యు వెంకటస్వామి



దేవునితిర్మలాపూర్‌లో ప్రచారం చేస్తున్న మత్స్యకార సంఘం నాయకులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో రాజా బంగ్లా వద్ద ఈ నెల 21న నిర్వహించే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మత్స్యకార సంఘం రాష్ట్ర కార్యదర్శి బయ్యు వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఇందుకోసం శనివారం పెద్దకొత్తపల్లి మండలంలోని దేవునితిర్మలాపూర్, వెన్నచెర్ల, నక్కలపల్లి, చంద్రకల్, చిన్నకొత్తపల్లి, యాపట్ల, మారేడుమానుదిన్నె గ్రామాల్లో సంఘం మండల కమిటీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సంఘటితమై ఐక్యతను చాటుతూ కొల్లాపూర్ సభ విజయవంతం చేద్దామని అన్నారు. కార్యక్రమంలో సైదులు, ఎల్లయ్య, ఆంజనేయులు, రాములు, శివప్రసాద్, బాలనారాయణ పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగానే క్రీడాకారుల ఎంపిక

» డీవైఎస్‌వో వెంకటేశ్‌శెట్టి



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళి అర్పించి, పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

మక్తల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభ ఆధారంగానే క్రీడాకారుల ఎంపిక చేపడుతున్నట్లు డీవైఎస్‌వో వెంకటేశ్‌శెట్టి అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాలుర క్రికెట్ స్కూల్‌గేమ్స్ పోటీలను డీవైఎస్‌వో వెంకటేష్‌శెట్టి, ఎంఈవో అమీరొద్దీన్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 80మంది బాలురు హాజరుకాగా, 20 మందిని ఎంపిక చేశామన్నారు. జిల్లా జట్టు కెప్టెన్‌గా కొలిమి గౌతమ్‌చంద్ర, వైస్ కెప్టెన్‌గా కార్తికేయ, రాఘవేందర్, జాహిద్ ఉమర్ రహిమాన్, శ్రీహర్షిత్, నితిన్‌నాయక్, జగదీశ్, మొహ్మద్ రఫీ, సిద్దార్థరాయ్, ధనుష్, సాయి హర్షిత్, అభిరాం, రాహుల్‌రైనా చరణ్, శ్రీశాంత్‌రెడ్డి, సోఫియాన్, శివరాజ్ నాయక్, అలి అన్సారి, నవీద్, కార్తీక్, మొహ్మద్ షరీఫ్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కట్టసురేష్‌కుమార్‌గుప్తా, కోళ్ల వెంకటేష్, ఆదర్శ వెంకటేష్, వలీ, రహీంపటేల్, పీఈటీ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లమలలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

» రెండు రోజులుగా పెరిగిన చలి

» రైతన్నలకు తప్పని తిప్పలు

» చలికాలంలో అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు



రాయిచేడ్ గ్రామంలో చలి కాచుకుంటున్న చిన్నారులు, మహిళలు



డిండిలో తలకు వస్త్రాలు ధరించి కూరగాయాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

అచ్చంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు చలి తీవ్రత అధికమవుతుంది నల్లమల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసినట్లే చలి కూడా అధికంగా ఉంటుందో ఏమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉష్ణోగ్రతలు 14 డిగ్రీలకు పడిపోయాయి. వారం రోజులుగా నల్లమల ప్రజలు చలి తీవ్రతతో సతమతమవుతున్నారు. ఉబ్బసం, శ్వాసకోశ వ్యాధిగ్రస్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఉదయం 10 గంటలు దాటితే తప్పా చలి తగ్గడం లేదు. సాయంత్రం 6 దాటిందంటే గ్రామాల్లో చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు చలిమంటలు వేసుకొం టున్నారు. యాసంగి సాగులో రైతులు బిజీగా మారడంతో చలిని లెక్కచేయకుండా పనులకు వెళ్లాల్సి వస్తుంది. చలి తీవ్రతతో వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నల్లమలలో ఉష్ణోగ్రతల నమోదు ఇలా.. (డిగ్రీలలో)

తేదీ	గరిష్టం	కనిష్టం
12	31	18
13	29	18
14	28	18
15	27	14

బయటకు రావాలంటేనే భయం



ఉదయం బయటకు రావాలంటేనే భయ మేస్తుంది. రోజురోజుకు చలి బాగా పెడు తుంది. చద్దరు కప్పుకో కుండా బయటకు రాలేక పోతున్నాం.

- నారయ్య, ఉప్పునుంతల

వృద్ధులు జాగ్రత్త



చలికాలంలో వృద్ధులు, పిల్లలు ఆస్తమా ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవా లి. వెచ్చని బట్టలు, మఫ్లర్, సాక్స్‌క్యాప్ తప్పనిసరిగా ధరించాలి. తెల్లవారు జామున రాత్రి ఆలస్యంగా బయటకు వెళ్లడం తగ్గించాలి. శ్వాస తీసుకోవ డంలో ఇబ్బంది, దగ్గు ఉంటే ఉంటనే వైద్యులను సంప్రదించాలి.

- మహేశ్, ప్రభుత్వ వైద్యుడు, అచ్చంపేట

బిల్లులు వస్తున్నా.. గ్రౌండింగ్ సగమే!

(5వ పేజీ తరువాయి)

ఇంటి నిర్మాణ స్థాయిలను బట్టి బిల్లులు మంజూరు చేస్తుంది. ఎక్కువ మొత్తంలో పెండింగ్ కూడా ఉండటం లేదు. అయినప్పటికీ ఇళ్ల నిర్మాణానికి చాలామంది ముందుకు రావడం లేదు. అయితే బిల్లుల విషయాల్లో ఉన్న భయాలను అధికారులు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంత ఠంచనుగా బిల్లులు వస్తున్నా.. లబ్ధిదారులకు తెలియకపోవడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు.

నారాయణపేట జిల్లాలో ఇప్పటివరకు 4703 ఇళ్లు గ్రౌండింగ్ కాగా.. ఇప్పటివరకు రూ. 41 కోట్ల బిల్లులు మంజూరయ్యాయి. ప్రస్తుత నిర్మాణ స్థాయిని బట్టి 200 ఇళ్లకు రూ. 4 కోట్లు బిల్లు సోమవారం జమ అవుతాయని అధికారులు చెబుతున్నారు. గద్వాల జిల్లాలో ఇప్పటివరకు రూ. 45.25 కోట్లు మంజూరు కాగా.. రూ. 82లక్షలు మాత్రమే పెండింగ్ ఉంది. అవి కూడా సోమవారం విడుదల కానున్నాయి.

వనపర్తి జిల్లాలో రూ. 71.70 కోట్లు మంజూరయ్యాయి. 43 ఇళ్లకు సంబంధించి రూ. 43 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ. 92 కోట్లు ఇప్పటివరకు మంజూరు కాగా.. ప్రస్తుతం ఎలాంటి పెండింగ్ బకాయిలు లేవు. ప్రతీ సోమవారం పేమెంట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయని చెప్పవచ్చు.

ఈ స్థాయిలో ఇలా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మొదటి విడతగా 40,306 ఇళ్లు మంజూరు కాగా.. ఇందులో 27,375 ఇళ్లు మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయి. వాటిలో మార్కింగ్ చేసిన ఇళ్లు 4310 కాగా.. అవి ఆ దశలోనే ఆగిపోయాయి. మార్కింగ్ చేసుకున్న తర్వాత వాటి నిర్మాణం కొనసాగడం లేదు. అలాగే బేస్‌మెంట్ లెవల్‌లో 14,459 ఇళ్లు ఉండగా.. రూఫ్ లెవల్‌లో 4992 ఇళ్లు, స్లాబ్ లెవల్‌లో 3566 ఇళ్లు, దాదాపు 48 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో ఎక్కువ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుంటుండగా.. మిగతా జిల్లాల్లో కొంత మందకొడిగా సాగుతోంది.

ఇళ్ల గ్రౌండింగ్ విషయంలో మాత్రం అన్ని జిల్లాలు ఒకే తరహాలో ఉన్నాయి. 50 నుంచి 55శాతం వరకు మాత్రమే గ్రౌండింగ్ అవుతున్నాయి. అయితే మార్కింగ్ తీసుకోకుండా.. గ్రౌండింగ్ కాని ఇళ్లను లబ్ధిదారులకు సంబంధించి రెండో జాబితాలో ఉన్న లబ్ధిదారులకు కేటాయిస్తే మేలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే ఇళ్లు చిన్నగా అవుతుందని, నిబంధనలు పాటించకపోతే బిల్లులు రావనే అనుమానాలు నివృత్తి చేసి.. అధికారులు ప్రోత్సహిస్తే వారికీ మేలు జరిగే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

అత్యాపత్య క్రీడకు ప్రాధాన్యం

» కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

» అట్టహాసంగా ముగిసిన జాతీయ స్థాయి పోటీలు



బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన కేరళ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు, నాయకులు

కల్వకుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రాచీనమైన అత్యాపత్య క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. అత్యాపత్య నాగర్‌కర్నూల్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 9వ సీనియర్ (బాలుర, బాలికల) నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీలకు తెలంగాణ, పుదుచ్చేరి, గోవా, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, బిహార్ రాష్ట్రాల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగినా బాలికల విభాగంలో మొదటి స్థానంలో కేరళ, ద్వితీయ స్థానంలో పుదుచ్చేరి, తృతీయ స్థానంలో తమిళ నాడు నిలిచాయి. బాలుర విభాగంలో మొదటి స్థానంలో పుదుచ్చేరి, ద్వితీయ స్థానంలో మహారాష్ట్ర, తృతీయ స్థానంలో కర్ణాటక నిలిచాయి. ముగింపు సందర్భంగా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన బహుమతుల ప్రధానోత్సవానికి ఎమ్మెల్యే, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడలను కల్వకుర్తిలో నిర్వహించడం అభినందనీయ మని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యాపత్య క్రీడలకు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో రెండు శాతం రిజర్వేషన్లను కల్పిస్తున్నట్లుగానే, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో నేషనల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఆర్గనైజర్ పీడీ అంజి, జిల్లెల రాములు, ఉమా మనీలా, సంజీవ్‌కుమార్‌యాదవ్, పసుల రమాకాంత్ రెడ్డి, బ్యాంగి ఆనంద్‌కుమార్, శివకుమార్, ప్రసాద్, వివిధ రాష్ట్రాల అత్యాపత్య అ సోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో జోరుగా జీరో దందా

» టెండర్ లేకుండానే వ్యాపారుల కొనుగోళ్లు

» బాదేపల్లి మార్కెట్ అవకతవకలపై నిఘా కరువు



బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు విక్రయానికి తీసుకొచ్చిన మొక్కజొన్న

జడ్చర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో జీరో దందా జోరుగా సాగుతోంది. రైతులు తెచ్చిన మొక్కజొన్నను టెండర్ ప్రక్రియలో కాకుండా జీరోలో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రైతులు కమీషన్ ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. సీజన్ ప్రారంభం నుంచి ఇద్దరు ట్రేడర్లు పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినట్లు తెలిసింది.

టెండర్ ద్వారా కొంటే రైతులకు లాభం

రైతులు తెచ్చిన ధాన్యం కమీషన్ ఏజెంట్లు కుప్పలుగా పోసి, టెండర్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. టెండర్‌లో ఒక్కొక్కరుగా రహస్యంగా ధరలను కోట్ చేస్తారు. అధిక ధర పలికిన వ్యాపారికి మార్కెట్ శాఖ అధికారులు వెల్లడిస్తారు. ఈ ప్రక్రియలో టెండర్‌లో అత్యధిక ధర పలికిన ట్రేడర్స్‌కు రైతులు విక్రయిస్తారు. ఇందుకు భిన్నంగా టెండర్ ప్రక్రియ నిర్వహించిన అనంతరం అధిక ధరకు కోట్ చేసిన వారికి కాకుండా జీరో వ్యాపారంలో కొనుగోలు చేసే ట్రేడర్స్‌కు కమీషన్ ఏజెంట్లు విక్రయిస్తున్నారు. ఈ అంశంపై అధిక కోట్ చేసిన ట్రేడర్స్ తమకు కాకుండ జీరోలో మరో ట్రేడర్‌కు ఎందుకు విక్రయిస్తున్నారనే అంశాన్ని ఇతర ట్రేడర్స్ లేవనెత్తకపోవడంతో జీరో వ్యాపారిదే ఇష్టారాజ్యంగా మారిపోయింది.

గట్టిగా ప్రశ్నించిన వారికి మొక్కజొన్న తెచ్చిన రైతు తిరిగి తీసుకెళ్లాడన్న సమాధానం వస్తుండడంతో ఇతర ట్రేడర్స్ సైతం మిన్నుకుండిపోతున్నారు.

పత్తి మార్కెట్‌లో సైతం..

ఇదిలా ఉండగా మరికొందరు రైతులు బాదేపల్లి పత్తి మార్కెట్‌లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు తీసుకువస్తున్నారు. అధిక తేమ ఉండడంతో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 14శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టుకుంటున్నారు. పత్తి మార్కెట్‌లో సైతం సదరు ట్రేడర్స్ రైతుల నుంచి మొక్కజొన్నను నేరుగా జీరోలో కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే 15రోజుల గడువు అనంతరం మీ ఖాతాలో డబ్బులు పడుతాయని, తామైతే వెంటనే ఇచ్చేస్తామంటూ మభ్యపెడుతున్నారు. ఒక రోజు వ్యవధిలో డబ్బులు వస్తాయన్న ఉద్దేశ్యంతో రైతులు సైతం సదరు ట్రేడర్‌కు విక్రయిస్తున్నారు. మొక్కజొన్నకు డబ్బుల చెల్లింపులో రైతు నుంచి రూ.100కు రూ3 చొప్పున క్యాష్ కటింగ్ పేరుతో కోత విధిస్తున్నారు. తాము నష్టపోతున్నామని తెలియని రైతులు అమాయకంగా ట్రేడర్స్‌కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించేవిధంగా రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జీరో వ్యాపారం చేస్తే చర్యలు



బాదేపల్లి మార్కెట్‌లో, అలాగే పత్తి మార్కెట్‌లో రైతుల నుంచి జీరోలో మొక్కజొన్న కొనుగోలు చేసే ట్రేడర్స్‌పై చర్యలు తీసుకుంటాం. జీరో వ్యాపారం జరుగుతున్నట్లుగా తమ దృష్టికి రాలేదు. ఇప్పటి నుంచి క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- అశ్వక్‌అహ్మద్, మార్కెట్ కార్యదర్శి

సత్తాచాటిన 'పల్లెటూరి కుర్రాళ్లు'

» పోలీసు అమరవీరుల షార్ట్‌ఫిల్మ్ అవార్డుకు ఎంపిక

» అభినందించిన డీజీపీ, ఎస్పీ



డీజీపీ శివధర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పల్లెటూరి కుర్రాళ్లు టీం

గద్వాల క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన పల్లెటూరి కుర్రాళ్లు (యూట్యూబ్ ఛానెల్) పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా అక్టోబరు 21 నిర్వహించిన రాష్ట్రస్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీలో రెండవ బహుమతి సాధించారు. హెల్మెట్ లేకుండా, ట్రిబుల్ రైడింగ్ చేస్తూ వెళ్లే యువకుల నిర్లక్ష్యం, రెకమండేషన్లు కాదు.. రోడ్డు భద్రతా నియమాలే ప్రాణాలను కాపాడుతాయనే సందేశాన్ని షార్ట్‌ఫిల్మ్‌లో ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్ ఎల్బీనగర్ స్టేడియంలో జరిగిన అవార్డు కార్యక్రమంలో డీజీపీ శివధర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతిని అందుకున్నారు. ఈ విజయంలో ప్రధాన పాత్ర పోషించిన టీం ఖదీర్, దేవేందర్, హరిప్రసాద్, రాజు, పరశురాంలను ఎస్పీ శ్రీనివాసరావు శనివారం ఆయన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ విజయంతో జిల్లా రాష్ట్రంలో మరోసారి తన ప్రతిష్ఠను నిలబెట్టుకుందని ఎస్పీ తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అందజేత



బాధితుడి ఫోన్ అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ దండోత్కార్ వెంకోజీ

ఊర్కొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కార్తీకమాసం చివరి శనివారం కావడంతో భక్తులు అధిక తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసినవి. భక్తులు కల్వకుర్తికి చెందిన అరవింద్ ఐఫోన్ సుమారు రూ. 70 వేల విలువ, జడ్చర్లకు చెందిన మరో వ్యక్తి రూ. 20 వేల విలువ గల మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. అక్కడే విధినిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ దండోత్కార్ వెంకోజీకి దొరకడంతో బాధితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అందజేశారు. విధినిర్వహణలో ఉండి బాధితులకు ఫోన్లు అందజేయడంతో పలువురు అభినందించారు.

ఉపాధి హామీ పనుల్లో రూ.36వేల అక్రమాలు



ప్రజా వేదికలో సిబ్బందితో వివరాలు ఆరా తీస్తున్న అధికారులు

తిమ్మాజిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో భాగంగా 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025వరకు గ్రామాల్లో జరిగిన వివిధ పనులపై మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో శనివారం 15వ సామాజిక తనిఖీపైప్రజా వేదిక నిర్వహించారు. 26 గ్రామ పంచాయతీలకు సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధి హామీ సిబ్బంది సామాజిక తనిఖీ బృందాలు అక్రమాలపై ప్రజా వేదిక చేపట్టారు. మండల వ్యాప్తంగా రికవరీ రూ.23 వేల 59లు కాగా రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రూ.13వేల జరిమానా విధించారని అడిషనల్ డీఆర్‌డీపీ రాజేశ్వరి, ఎంపీడీవో లక్ష్మీదేవిలు తెలిపారు. శిక్షణ కలెక్టర్ అశోక్, విజిలెన్స్ విభాగపు అధికారులు రాజు, నసీరుద్దీన్, జంగయ్య, ఏపీవో సత్యానారాయణ, ఎస్‌ఆర్‌పీ గంగరాజు, పీఆర్‌ఏఈ శ్రీశైలం, జేక్యూసీ అరవింద్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు బాలరాజు, నాగమణి, తాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



నరసన్నగుట్టపై స్వయంభువుగా కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి

తిమ్మాజిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా భక్తులు ఆలయ ఆవరణలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించి లక్ష్మీనరసింహస్వామికి మహాలక్ష్మీ, ఆండాలమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారని వేద పండితులు గంగాధర శర్మ తెలిపారు. గుమ్మకొండ గ్రామానికి చెందిన తూడి మాధవరెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.

జాతీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



సోలార్‌తో తయారు చేసిన సైకిల్, పక్కన విద్యార్థి

బల్మూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బాలల వైజ్ఞానిక ప్రదర్శనకు నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వేంరెడ్డి నరేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు జగన్‌చంద్ర, వినయ్ సోలార్‌తో నడిచే సైకిల్, ఇతర పరికరాలను నాగర్‌కర్నూల్‌లో జరిగిన ప్రదర్శనలో ఎంపికై రాష్ట్రస్థాయిలో ప్రదర్శించారని తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భూపాల్‌లో ఈనెల 18నుంచి 23వరకు జరిగే అంతర్జాతీయ బాలలవైజ్ఞానిక ప్రదర్శనలో వీరు ప్రతిభ కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


జిడ్డి అనిత (ఫైల్)

ఊర్కొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం తిమ్మన్నపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలి తల్లి తిమ్మన్నపల్లి గ్రామానికి చెందిన ఆవుల అంజమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తన పెద్ద కూతురు అనిత (28)ను అదే గ్రామానికి చెందిన జిడ్డి కృష్ణయ్యతో 9 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. నాలుగేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుండగా పలుచోట్ల చూపించినా తగ్గలేదని తెలిపారు. ఆ బాధను తట్టుకోలేక శుక్రవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటుండగా జిడ్డు కృష్ణయ్య ఫోన్ చేసి తెలియజేయగా వెంటనే అక్కడికి చేరుకొని కల్వకుర్తి ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నంలోనే మృతి చెందినట్లు తెలిపారు. శనివారం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నారాయణపేట రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పక్‌పల్లి శివారులో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ రాముడు తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 40ఏళ్లలోపు ఉండొచ్చని, మృతి చెంది 10 నుంచి 15రోజులు అయి ఉండొచ్చని అంచనా వేశారు. మృతుడి శరీరంపై ఎలాంటి గుర్తింపు వస్తువులు లేదా ఆధారాలు లభించకపోవడంతో మృతుడి వివరాలు తెలియరాలేదన్నారు. దీనికి సంబంధించి సమాచారం తెలిసిన వారు వెంటనే 8712670417కు ఫోన్ చేయాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


వెంకటేష్ (ఫైల్)

కొత్తకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని నాటవెల్లి శివారులోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన మున్నూర్ వెంకటేష్ (45) ద్విచక్ర వాహనంపై పెబ్బేర్ సంతకు వెళ్తుండగా వాహనం ఢీకొంది. స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి..

» విద్యుత్ షాక్‌తో రైతు మృతి


పాలెం సుధాకర్ (ఫైల్)

పాన్‌గల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి షాక్‌తో రైతు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంగళాయపల్లి గ్రామానికి చెందిన పాలెం సుధాకర్ (56) తన పొలంలోని మోటార్ ఆన్ చేస్తున్న సందర్భంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పూరిగుడిసె దగ్ధం

కొల్లాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని నార్లాపూర్ గ్రామంలో దళిత పుట్టపాగ నిరంజన్ పూరి గుడిసెను గుర్తు తెలియని దుండగులు శనివారం తెల్లవారు జామున నిప్పంటించారు. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. గుడిసెలో ఉన్న వంట సామగ్రి, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. తన గుడిసె పూర్తిగా కాలిపోయిందని ప్రభుత్వం ఆదుకోవాలని నిరంజన్ కోరారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

వనపర్తి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పాన్‌గల్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన నాగన్న తన ఆటోను బస్టాండ్ నుంచి ప్యాసింజర్‌ను ఎక్కించుకొని రాజీవ్ చౌక్ వస్తుండగా మార్గమధ్యలో బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ నాగన్నతో పాటు మరొకరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

జడ్చర్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, గంగాపురం మధ్యలో శనివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో జడ్చర్ల మండలం తంగెళ్లపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ, మిడ్జిల్ మండల కేంద్రానికి చెందిన రామకృష్ణకు బలమైన గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ వద్ద ఉన్న రూ.5400 నగదుతో పాటు గాయపడిన ఇద్దరి వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్‌లను కుటుంబసభ్యులకు అంబులెన్స్ ఈఎంటీ శివకుమార్ అందజేశారు.

ఇంట్లో సిలిండర్ లీకై మంటలు

నారాయణపేట, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పళ్ల ప్రాంతంలో కిషన్‌రావు ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై శనివారం మంటలు చెలరేగాయి. ఇదే సమయంలో మంటలకు వైర్లు కాలి షాట్ సర్క్యూట్ ఏర్పడింది. వంటింట్లో వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకోరావడంతో ప్రమాదం తప్పింది. ఏఈ మహేశ్‌గౌడ్, గ్యాస్ కంపెనీ మేనేజర్ శాంతప్ప పరిశీలించారు.

బైకును ఢీకొట్టిన కారు

» కుమార్తె మృతి, తండ్రికి తీవ్ర గాయాలు

వెల్దండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని చెర్కూరి గ్రామ సమీపంలో హైదరాబాద్- శ్రీశైలం ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కూతురు మృతి చెందగా, తండ్రికి తీవ్ర గాయలయ్యాయి. వంగూరు మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన సురేష్ తన ఇద్దరు కూతుర్లతో కలిసి బైక్‌పై కల్వకుర్తి వైపు వస్తున్నారు. ఈక్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొనడంతో సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా, కూతురు వరలక్ష్మి (11) అక్కడికక్కడే మృతి చెందింది. మరో కూతురు నిషితకు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ఎస్‌ఐ కురుమూర్తి బాలిక మృతదేహన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కల్వకుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలంలోని తుర్కలపల్లి గేటు సమీపంలో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైకుపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో గాయపడ్డ వారు మండలంలోని బెక్కర గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, శ్యామల్ రెడ్డిలుగా స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని వెంటనే కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో ఇద్దరి అదృశ్యం

నవాబ్‌పేట/భూత్పూర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని హన్మసానిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం తెలిపిన ప్రకారం వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మల్లయ్యతో 15ఏళ్ల క్రితం నిర్మలమ్మతో వివాహమైంది. గతేడాది నుంచి భార్యాభర్తలు గొడవపడేవారు. గత నెల 18న రాత్రి నిర్మలమ్మ ఇంటినుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శనివారం భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

● భూత్పూర్ మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ చెందిన అంజమ్మ భర్తతో గొడవ పడి ఈ నెల 5న ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో శనివారం భర్త రాసాని వెంకటేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

టూరిజానికే ప్రాధాన్యమా?


బురదమయంగా మారిన ఈర్లపెంట రహదారి

» చెంచుల సమస్యలు పట్టని అటవీశాఖ
» కనీసం అంబులెన్స్ వెళ్లలేని దుస్థితి
» సరకులు తెచ్చుకోలేక ఇక్కట్లు
» పెంటలకు వెళ్లే దారి లేక నరకయాతన

మన్ననూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం అడవుల్లో జీవనం సాగిస్తూ వన్యప్రాణులకు రక్షణగా నిలుస్తున్న చెంచులకు కనీస రహదారి సౌకర్యం కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాగా టూరిజానికి మాత్రం ఏటేటా అభివృద్ధి పనులు చేపడుతూ నిబంధనలు ఏవీ పాటించడం లేదు. కానీ చెంచు పెంటలకు రోడ్డు వేయడానికి మాత్రం అటవీ శాఖ నిబంధనలు అడ్డుగా ఉన్నాయనే సాకులు చెబుతున్నారు. నల్లమల ప్రాంతంలో ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో మట్టిరోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించేందుకు చెంచులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పాపూర్, మల్లాపూర్, సంగిడి గుండాల, ఈర్లపెంట, రాంపూర్, మేడిమల్కల పెంటలకు వెళ్లే రోడ్డంతా దెబ్బతిన్నది.

వైద్య సేవలు, నిత్యావసరాలకు ఆటంకం

చెంచు పెంటలకు వైద్య సేవలందించేందుకు 108 వాహనాలు, అపోలో, ఆర్డీటీ అంబులెన్సులు అందుబాటులో ఉన్నా, దారిలో వాహనాలు చిక్కుకుంటుండడంతో వైద్య సిబ్బంది వెళ్లలేకపోతున్నారు. జీసీసీ ఆధ్వర్యంలో చెంచులకు ప్రతీ నెలా రేషన్ బియ్యం అందించేందుకు అప్పాపూర్‌లో డీఆర్ డిపో ఉంది. అప్పాపూర్‌లో ఆశ్రమ పాఠశాల ఉంది. ఇక్కడికి రేషన్ తీసుకెళ్లే లారీ సైతం రోడ్డుపై గుంతల్లో ఇరుక్కుపోతోంది. ఐసీడీఎస్ ద్వారా పెంటలకు తీసుకెళ్లే పోషకాహార కిట్లు సైతం తీసుకెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. చెంచులు ఆటోల్లో, ద్విచక్ర వాహనాలపై మన్ననూరు, అచ్చంపేట ప్రాంతాలకు వచ్చిపోవాలన్నా ఇబ్బంది పడుతున్నారు. అప్పాపూర్ వరకు రహదారి ఓ మాదిరిగా ఉన్నా, అక్కడి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉండే భౌరాపూర్, ఈర్లపెంట, మేడిమాల్కల సంగిడి గుండాల పెంటలకు వెళ్లే దారి పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డు సరిగా లేని కారణంగా ఉపాధ్యాయులు సైతం ఆశ్రమ పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదు. అటవీ నిబంధనలను సాకుగా చూపిస్తూ తమ రోడ్డును బాగు చేయడం లేదని, గుంతలు పడిన చోట కనీసం తట్టెడు మన్ను వేసైనా దారి వేసే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటవీశాఖ వారు మాత్రం టైగర్ సఫారీ వాహనాలు వెళ్లేందుకు టూరిజం అభివృద్ధి కోసం ఫర్హాబాద్ నుంచి వ్యూ పాయింట్, గుండం రహదారులను మాత్రం అభివృద్ధి చేసుకుంటున్నారని చెంచులు ఆరోపిస్తున్నారు.


అప్పాపూర్ పెంటకు వెళ్లే దారిలో పక్కకు ఒరిగిన రేషన్ బియ్యం వాహనం

వైద్యులు రావడం లేదు



భౌరాపూర్, ఈర్లపెంట, సంగిడి గుండాలకు రోడ్డు బాగా లేకపోవడంతో డాక్టర్లు, అంబులెన్సులు పెంటలకు రాకపోవడంతో జబ్బు చేస్తే మందులు లేక ఇబ్బంది పడుతున్నాం. ఈ ప్రాంత చెంచు యువకులు ద్విచక్ర వాహనాలపై అతి కష్టం మీద మన్ననూరుకు వెళ్లి మందులను తీసుకువస్తున్నారు. రోడ్డు బాగు చేస్తే తమ సమస్యలు తీరుతాయి.

\- నిమ్మల గురువయ్య, ఈర్లపెంట

రేషన్ తెచ్చుకోలేకపోతున్నాం



తాము రేషన్ కోసం మన్ననూరు జీసీసీ డీఆర్ డిపోకు వెళ్లి వేలిముద్రలు వేసి రావాల్సి ఉండగా, ఇటీవల వర్షాలకు రహదారి వెంట ఆటోలు తిరిగేందుకు కూడా కష్టంగా ఉంది. ఐటీడీఏ అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలి.

\- చిగుర్ల బయ్యన్న , మల్లాపూర్ పెంట

నిరంతర పోరాటమే సీపీఐ చరిత్ర

» జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి
» అట్టహాసంగా ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాల బస్సు జాత



గద్వాలలో బస్సుజాత ప్రారంభ సభలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి

గద్వాల టౌన్ / వనపర్తి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య పోరాటం మొదలుకుని నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి ఘనత భారత కమ్యూనిస్టు పార్టీ సొంతమని జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి అన్నారు. పార్టీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన ప్రచార బస్సు జాతను శనివారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో పార్టీ ఎమ్మెల్యే నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ, జిల్లా కార్యదర్శి ఆంజనేయులుతో కలిసి పల్లా వెంకట రెడ్డి ప్రారంభించారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తూ ప్రజాస్వామిక స్ఫూర్తిని నిర్వీర్యం చేస్తూ దేశంలో సాగుతున్న పాలనపై ప్రజలు నిలదీయాలన్నారు. పెట్టుబడిదారులతో కుమ్మక్కై దేశ సంపదను వారికి దోచిపెడుతూ.. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి శ్రామికులను దోపిడీ చేస్తున్న బీజేపీ ప్రభుత్వం తీరును ఎండగట్టేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా డిసెంబరు 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగన్న, ఆశన్న, చెన్నయ్య, రవి, నాగార్జున, వెంకటస్వామి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, కురువ పల్లయ్య, మధుసూదన్ బాబు, మోహన్‌రావు, పరమేష్, ప్రవీణ్, తిమ్మప్ప పాల్గొన్నారు.

ప్రజల పక్షానే సీపీఐ: ఎమ్మెల్సీ

పెబ్బేరు (ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల పక్షాన నిలబడి, దోపిడీ రహిత సమాజ నిర్మాణం కోసం సీపీఐ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి చరిత్రలో నిలిచిందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన ప్రచార యాత్ర శనివారం పెబ్బేరుకు చేరుకుంది. బాలనర్సింహ, విజయరాములు, ఆంజనేయులు, కుతుబ్, శ్రీనివాసులు, చారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వందేళ్ల ఉత్సవాల ప్రచార జాత సాయంత్రం వనపర్తి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ కార్యాలయం నుంచి పాలిటెక్నిక్ వరకు ఎర్ర బోనాల ప్రదర్శన నిర్వహించి బస్సు జాతకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభను నిర్వహించారు.

పటేల్ స్ఫూర్తితో ఐక్యత కోసం కృషి చేద్దాం

» గుజరాత్ ఎంపీ పార్మర్ జశ్వంత్‌సిన్హ్


మాట్లాడుతున్న ఎంపీ పార్మర్ జశ్వంత్‌సిన్హ్

కందనూలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ వల్లభాయ్‌పటేల్ స్ఫూర్తితో దేశంలో ఐక్యతను సాధించేందుకు కృషి చేద్దామని గుజరాత్ ఎంపీ పార్మర్ జశ్వంత్‌సిన్హ్ యువతకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. స్వాతంత్ర్య ఉద్యమంలో, అనంతరం దేశ ఐక్యతను చాటి చెప్పిన మహానీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించాలని ప్రధాని నరేంద్రమోడీ నిర్ణయించి, అక్టోబరు 26న ప్రారంభించారని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు మాట్లాడుతూ అభివృద్ధికే బిహార్ ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన అభివృద్ధి ఫలాలు నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్నాయని వివరించారు. జిల్లాలో జాతీయ రహదారులైన 167కే, జడ్చర్లకోదాడ, ఇతర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. మన్ననూర్-శ్రీశైలం కారిడార్ జాతీయ రహదారి పనులకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చి నిధులు మంజూరయ్యాయన్నారు. డోర్నకల్, గద్వాల రైల్వే లైన్ సర్వే తుది దశకు వచ్చిందని త్వరలోనే పనులకు కూడా కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చి నిధులు మంజూరు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రంగౌడ్, నాయకులు రాము, ప్రమోద్‌కుమార్, చందు, భీమేష్, సుధాకర్, సత్యనారాయణ, వెంకటేశ్, శివ, సూరిబాబు, బాలస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభంలో రసాభాస

» రైతులు దళారులను నమ్మొద్దు
» అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు


కొండేరులో కొనుగోలు కేంద్రం వద్ద వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని కొండేరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య రసాభాస చోటు చేసుకుంది. ఐకేపీ ఆధ్వర్యంలో శనివారం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమానికి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో పాటు స్థానిక ఇరు పార్టీల నాయకులకు ఆహ్వానం అందింది. కానీ ఎమ్మెల్యే వచ్చేకంటే ముందే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ కమి టీ డైరెక్టర్ రుక్మానందరెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. అప్పుడే ఎమ్మెల్యే కొనుగోలు కేంద్రం వద్దకు చేరుకోవడంతో ప్రొటోకాల్ పాటించకుండా ఎలా ప్రారంభిస్తారని నిలదీయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. చివరకు పోలీసుల జోక్యంతో కార్యక్రమాన్ని సజావుగా కొనసాగించారు. టెంకాయ కొట్టి ఎమ్మెల్యే ప్రారంభించిన ప్రారంభించారు. అనంతరం తిమ్మాపురం గ్రామంలో మరో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటేశ్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, సోమనాద్రి, నారాయణనాయుడు, ఈరన్న, వెంకటేష్ తదితరలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక


ఎంపికలకు హాజరైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అర్బన్ మండల విద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ అన్నారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో అండర్-14, 17 ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్ల ఎంపికలను నిర్వహించారు. ఎంఈవో లక్ష్మణ్‌సింగ్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా టోర్నీలో జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, సాదత్‌ఖాన్, వడ్డెన్న, పరశురాం, షటిల్ అసోసియేషన్ సెక్రటరీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న జిల్లా వాలీబాల్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న మహబూబ్‌నగర్ జిల్లా అండర్-14 బాల, బాలికల వాలీబాల్ టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో, ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో పీడీకి రిపోర్టు చేయాలని కోరారు.

రేపు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల..

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అండర్-14, 19 ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో, అండర్-19 క్రీడాకారులు పదో తరగతి మెమో, బోనఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9గంటలకు స్టేడియం మైదానంలో పీడీ శైలజకు రిపోర్టు చేయాలని కోరారు.

ఖేలో ఇండియాకు రితికా రాథోడ్


రితికా రాథోడ్

ఊర్కొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్-2025కు నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట పంచాయతీ పరిధిలోని ఠాకూర్ తండాకు చెందిన కరాటే మాస్టర్ కిరణ్‌నాయక్ కుమార్తె రీతికా రాథోడ్ ఎంపికైంది. మేడ్చల్ జిల్లాలో ఆదివారం ప్రారంభం కానున్న పెన్కాక్ సిలాట్ ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్-2025కు తుంగల్ ఇవెంట్‌లో పాల్గొనున్నది. కల్వకుర్తి పట్టణంలోని ఎస్‌పీఆర్ సెమీ రెసిడెన్సియల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతుంది.

బైక్‌లో దూరిన ఉడుము


బైక్ సీటు కింద ఇరుక్కున్న ఉడుము

నారాయణపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగారం చౌరస్తాలో ఉన్న తిప్పన్న బైక్ మెకానిక్ షాప్ వద్ద శనివారం బయట నిలిపిన పాత బైక్‌లో ఉడుము దూరింది. ఇది గమనించిన మెకానిక్ అందులో పాము ఉందని భావించి మైదాన ప్రాంతంలోకి తెచ్చాడు. సైడ్ బాక్స్‌ను తెరిచి చూడగా అందులో నుంచి ఉడుము బయటకు వచ్చి పక్కనే ఉన్న పొదల్లోకి జారుకుంది.



ఇంటర్వ్యూ..

భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- మునీరుద్దీన్, తహసీల్దార్



బిజినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు భూ సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వాటి పరిష్కారానికి గ్రామాల్లో రైతు సదస్సులను నిర్వహిస్తున్నదని తహసీల్దార్ మునీరుద్దీన్ తెలిపారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను క్షేత్ర పరిశీలన, సర్వే చేసి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో రైతుల నుంచి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ?

మండల వ్యాప్తంగా 1,594 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. వాటిలో 130 దరఖాస్తులను పరిష్కరించాం. కొన్ని తప్పుడు దరఖాస్తులను తిరస్కరించాం. ఎక్కువ మంది రైతుల భూ సమస్యలు భాగ పరిష్కారాలు కాకపోవడం, కోర్టు వివాదాల్లో ఉండడం, సాదాబైనామాలు ఉన్న మోకాపై లేకపోవడం, మోకాపై ఉన్నా సరైన ధ్రువపత్రాలు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఎక్కువ సమయం తీసుకొని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూస్తున్నాం.

కులం, ఆదాయం, వారసత్వ సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేస్తున్నారని ఆరోపణలపై మీరేమంటారు ?

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతుండడంతో కొందరు తప్పుడు పత్రాలతో కులం, ఆదాయం తీసుకోవచ్చని ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఇస్తున్నాం. అలాగే ఎవరైనా మరణించి ఐదేళ్లు దాటితే వారసత్వ సర్టిఫికెట్ ఇచ్చేందుకు తహసీల్దార్‌కు అధికారం లేకపోవడంతో దరఖాస్తుదారులకు ఎండార్స్‌మెంట్ ఇస్తున్నాం. దానితో కోర్టులో తీసుకోవచ్చు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ఏమైనా చేశారా?

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎన్నికల సామగ్రి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు, అవసరమైన ఎన్నికల సిబ్బంది వివరాలు, ఓటరు లిస్టుల ప్రచురణ వంటి అన్ని పూర్తి చేశాం. ప్రభుత్వం ఎప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా నిర్వహణకు సిద్ధం చేసుకున్నాం.

న్యూస్ బాక్స్

సీఎంను కలిసిన మంత్రి జూపల్లి

కొల్లాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మహానగరంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం తన గృహంలో మర్యాదపూర్వకంగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జీగా బాధ్యతలు చేపట్టి మెజార్టీ సాధించిన మంత్రి జూపల్లిని సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

సీపీఐ సభ పోస్టర్లు విడుదల

అచ్చంపేటటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వచ్చే నెల 26న సభ ఖమ్మం జిల్లాలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ కార్యదర్శి పెర్ముల గోపాల్ తెలిపారు. శతాబ్ది ఉత్సవాల వాల్ పోస్టర్‌ను శనివారం పట్టణంలో విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేష్, కృష్ణ, రాజు, మంజుల, లాలయ్య, చిట్టమ్మ, స్వామి, శాంతమ్మ, దేవి పాల్గొన్నారు.

కుక్కలను నివారించాలి

కల్వకుర్తి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తర్నికల్ గ్రామంలో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శికి పలువురు గ్రామస్థులు శనివారం వినతి పత్రం అందజేశారు. పిచ్చికుక్కలు ఎక్కువగా కావడం వల్ల చిన్న పిల్లలను, వృద్ధులను కరిచి, గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామస్థులు తాళ్ల సురేష్‌గౌడ్, వర్కాల దేవయ్య, బచ్చలకూర శ్రీశైలం, బక్కయ్య, వెంకటేశ్, సాయిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ డిగ్రీ తరగతులు

కొల్లాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : డా. బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు నేటి నుంచి తరగతులు ప్రారంభం అవుతున్నాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ ఉదయ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి సంవత్సరం 1 సెమిస్టర్, రెండవ సంవత్సరం 3వ సెమిస్టర్, మూడవ సంవత్సరం 5వ సెమిస్టర్ తరగతులు నేటి నుంచి కొనసాగుతాయని ప్రిన్సిపాల్ ఎంఎస్ ఉదయ్ కుమార్, ఓపెన్ డిగ్రీ కోఆర్డినేటర్ రమేష్ తెలిపారు.

'హామీలు అమలు చేయాలి'

కల్వకుర్తి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలుపర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు అన్నారు. శనివారం కల్వకుర్తిలోని సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా మహాసభ సీఐటీయూ జిల్లా నాయకులు బి.శివరాములు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.బాలస్వామి, సీఐటీయూ నాయకులు విజయ్‌గౌడ్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా నాయకురాలు నిర్మల, శాంతమ్మ, స్రవంతి, చంద్రకళ, జహీదా, యాదమ్మ పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలను కాపాడుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

- బిర్సాముండా జయంతి సందర్భంగా ఘన నివాళి

నాగర్‌కర్నూల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో విలువలున్నాయని, వాటిని కాపాడుకుంటూనే దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం ధర్తీ అబాభగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని దేడియా పాడ నుంచి దేశప్రధాని నరేంద్రమోదీ ఆయనకు నివాళులర్పించి ప్రసంగించారు. ప్రధాని ప్రసంగ కార్యక్రమాన్ని ప్రత్యేక ప్రసారం ద్వారా నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, జిల్లాక్రీడల అధికారి సీతారాం నాయక్, జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన ఆదివాసి నాయకులు మహిళలు విద్యార్థులు తదితరులు ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం బిర్సాముండా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ



బిర్సాముండా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్



విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ అధికారులు, గిరిజన నాయకులు మంగ్య నాయక్, దేశ్యనాయక్, రవి, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, వార్డెన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులను పరామర్శించిన కలెక్టర్

పెద్దకొత్తపల్లి మండలం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిల చికిత్స పొందుతండగా కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రమాద వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. కలెక్టర్ వెంట డీఈవో రమేష్‌కుమార్, డీఎంహెచ్‌వో రవినాయక్, వైద్యులు రోహిత్ ఉన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ పరిశీలన

కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం సందర్శించారు. క్యాంటీన్‌లో సమోసా, కాఫీని కలెక్టర్ స్వీకరించి రుచి చూశారు. క్యాంటీన్ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి పర్చుకోవాలన్నారు. కలెక్టర్ వెంట కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, డీఆర్‌డీఏ డీపీఎం కృష్ణ, ఏపీఎం చారి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి రమాకాంత్

కందనూలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజీమార్గమే రాజామార్గమని జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రమాకాంత్ అన్నారు. హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోదగిన అన్ని క్రిమినల్, చెక్‌బౌన్స్ కుటుంబ తగాదాలు, మోటారువాహన యాక్సిడెంట్, భూవివాదం, బ్యాంకు తదితర కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో అనంతరం స్పెషల్ సెషన్స్ జడ్జి నసీమా సుల్తానా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ శృతిదూత, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కాంతారావు, అడిషనల్ ఎస్పీ నేముల వెంకటేశ్వర్లు, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్టీసీ మేనేజర్ యాదయ్య, స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ కృష్ణమూర్తి, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్ (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో మొత్తం 52 కేసులు రాజీమార్గం ద్వారా, అపరాధ రుసుము విధించి పరిష్కరించారు. బెంచీకి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా దమ్ము ఉపనిషద్వాని, చైర్మన్ కం జూనియర్ సివిల్ న్యాయాధికారి, సభ్యులుగా కురుమూర్తి, న్యాయవాది, మోహన్‌లాల్ న్యాయవాది వ్యవహరించారు. ఏపీపీ శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాలస్వామి,



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రమాకాంత్

న్యాయవాదులు భాస్కర్ రెడ్డి, శివారెడ్డి, రాజేష్, నళిని, పిరంగి గోవింద్, పోలీసు కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయశాఖ సిబ్బంది హాజరయ్యారు.

● ఊర్కొండ : కల్వకుర్తి మున్సిఫ్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మండలంలోని బీఎన్ఎస్‌లో ఉన్న 6 క్రిమినల్ కేసులు, 10 ఈపీట్టి కేసులు, 11 డ్రంకెన్ డ్రైవ్ కేసులను లోక్ ఆదాలత్‌లో న్యాయాధికారి కావ్య సమక్షంలో రాజీ కుదిర్చినట్లు ఎస్ఐ కృష్ణదేవ తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : డీఈవో

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడోత్సవాల్లో ఖోఖో పోటీలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ నాగర్‌కర్నూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకోగా జడ్పీహెచ్ఎస్ తెల్కపల్లి విద్యార్థులు



విజేతలకు షీల్డును అందజేస్తున్న డీఈవో రమేష్‌కుమార్

ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. బాలికల విభాగంలో జడ్పీహెచ్ఎస్ కల్వకుర్తి విద్యార్థులు మొదటి బహుమతి, జడ్పీ హెచ్ఎస్ కోడేరు విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సీతారాం, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్.నాగేశ్వర్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయుడు సామ రమేష్ పాల్గొన్నారు.

'అభివృద్ధి పథకాలే గెలిపించాయి'

వంగూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్‌ను గెలిపించాయని యూత్ కాంగ్రెస్ అచ్చంపేట నియోజకవర్గ అధ్యక్షుడు క్యామ మల్లయ్య అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజల్లో సీఎం రేవంత్‌రెడ్డిపై గట్టి నమ్మకం ఉందనడానికి ఈ ఎన్నికే నిదర్శనమన్నారు.

18న గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

అమ్రాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18వ తేదీన అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాయంత్రం 4గంటలకు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేస్తారని ఎంపీడీవో ఎం.లింగయ్య శనివారం విలేకర్లకు తెలిపారు. సమీక్షా సమావేశానికి మండలంలోని అన్ని గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులతో పాటు మిషన్ భగీరథ, వాటర్‌గ్రిడ్ అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవాలు

వెల్దండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంపై మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శనివారం విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కుర్మిద్ద యాదగిరి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు పరమేశ్‌గౌడ్, సుబ్బయ్య, జంగయ్య, శశిధర్‌రెడ్డి, పెద్దయ్య, యాదగిరి, రామస్వామి పాల్గొన్నారు.

'పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా తీసుకెళ్దాం'

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ప్రతీ పల్లెకు ముదిరాజ్ జెండా తీసుకెళ్లి ముదిరాజ్‌ల ఆత్మ గౌరవాన్ని చాటుదామని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నూకం వెంకటేష్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ 21న జిల్లా వ్యాప్తంగా ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ ఉత్సవాల్లో ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, నాయకులు మహేష్, చందు, ఈశ్వర్, వెంకటయ్య, బాల్‌చందర్, కృష్ణయ్య, జంగయ్య, లక్ష్మణ్, నరసింహ, శివ, చెన్నకేశవులు, గోపి, సాయి, గణేష్, బాలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్యాంసుందర్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనం ప్రతి ఒక్కరు అలవర్చుని విజ్ఞాన వికాసాన్ని పొందాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్యాంసుందర్ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్ర లైబ్రరీలో పుస్తకప్రదర్శన నిర్వహించారు. ప్రతీ రోజు పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయించాలన్నారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు చదివే అభ్యర్థులు తమ లక్ష్యసాధన కోసం గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ జిలానీబేగం, సిబ్బంది తాజుద్దీన్,విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న పాఠకులు, సిబ్బంది

వచ్చే నెల 2 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

పెంట్లవెల్లి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలోని అలివేలు మంగలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయ కమిటీ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.చంద్రయ్య, సభ్యులు కొమ్ము రాజు మాట్లాడుతూ రామాపురం గ్రామంలో గుట్టపై వెలిసిన అలివేలుమంగ, లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు డిసెంబరు 2వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని అన్నారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవి, ఆకునమోని రాముయాదవ్, ఉడుత నాగరాజు, శివన్నగౌడ్, కొమ్ము గోపాల్, సాయిప్రకాష్, గడ్డం శ్రీరాములు, కాకి ఆంజనేయులుగౌడ్, కలమూరి మధు, మంతయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న గ్రామస్థులు

ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.800 చెల్లించాలి

అమ్రాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.800లు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చింతలోనిపల్లి గ్రామంలో శనివారం వ్యవసాయ కూలీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ వ్యవసాయ కూలీకి ఏడాదిలో 200రోజులు పని కల్పించి కనీస వేతనం అందించాలని ఆయన తెలిపారు. భూమిలేని ప్రతీ నిరుపేద కూలీలకు రూ.12వేలు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలన్నారు.దిక్కులేని మహిళలకు రూ.2,500 ఇవ్వాలని పనిప్రదేశంలో ప్రమాదం జరిగి మరణిస్తే పదిలక్షల బీమా వర్తింపజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం చింతలోనిపల్లి గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా మాసయ్య, పద్మలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.మల్లేష్ పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవొద్దు

- మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ

పెద్దకొత్తపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ ధాన్యాన్ని దళారులను ఆశ్రయించి మోసపోవొద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ సూచించారు. శనివారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులతో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గౌరమ్మచంద్రయ్య యాదవ్, పెద్దకొత్తపల్లి తాజా మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దకొత్తపల్లి సింగిల్ విండో చైర్మన్ బుడుగు శ్రీనివాస్‌యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్ చంద్రయ్య, దేవుని తిర్మలాపూర్ మాజీసర్పంచ్ సత్యం, పెరుమాళ్ల మాజీ సర్పంచ్ రాధావిష్ణువర్ధన్‌రెడ్డి, వెన్నచెర్ల మాజీ ఎంపీటీసీ రవికుమార్, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీటీసీ శశికళ, శివశంకర్ ఉన్నారు.



మొక్కజొన్నను పరిశీలిస్తున్న చైర్మన్ నరసింహ

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

కల్వకుర్తి/ చారకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి : రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జూపల్లి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాన్ని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ పంటలను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యాగౌడ్, తహసీల్దార్‌ఉమ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముస్తఫా, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలరాంగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఏఈవో జ్యోతి, సింగిల్‌విండో ఇన్‌చార్జి సీఈవో భీమయ్యాగౌడ్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు శివ, వెంకటయ్యగౌడ్, సాంబయ్యగౌడ్, నర్సింహారెడ్డి, నూరుపాల్‌నాయక్, రాములుయాదవ్, బొజ్జయ్య, మల్లేష్, రైతులు పాల్గొన్నారు.



జూపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

● కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామంలో పోలేమోని అనిత, శంకర్‌ల ఇందిరమ్మ ఇంటిని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. కల్వకుర్తిలోని రైతువేదికలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎంజేపీ బాలుర గురుకులాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల రాములు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్‌యాదవ్, మార్కెట్ డైరెక్టర్లు పసుల రమాకాంత్‌రెడ్డి, మసూద్, కొండల్, నాయకులు సంతుయాదవ్, దున్న నరేష్, దున్న భాస్కర్, మహిళా సంఘం సభ్యులు రెహానాబేగం, జ్యోతి, సుగుణ, సుమతి, మంజు భార్గవి, అనసూ య , ఎంపీడీవో వెంకట్రాములు, హౌసింగ్ డీఈ కేదార్, గ్రామ కార్యదర్శి స్వర్ణలత, ఎల్లికట్ల మాజీ సర్పంచ్ రాకేష్‌కుమార్ పాల్గొన్నారు.

దిలీపాచారికి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరామర్శ

బిజినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర నాయకుడు నెడనూరి దిలీపాచారిని ఆయన స్వగ్రామం ఖానాపూర్‌లో స్థానిక మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. దిలీపాచారి తల్లి తొమ్మిది రోజుల క్రితం మృతి చెందారు. శనివారం మర్రి జనార్దన్ రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి దిలీపాచారిని పరామర్శించి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. సంతాపం వ్యక్తం చేశారు. దిలీపాచారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులేందర్ రెడ్డి, జోగు ప్రదీప్, రమేష్‌గౌడ్ ఉన్నారు.



దిలీపాచారి తల్లి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

అగ్నిజ్వాలగా లేచిన గిరిజన మహావీరుడు

- భగవాన్ బిర్సాముండా జయంతిలో ఏబీవీపీ నాయకుడు సతీష్

అచ్చంపేటటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అరణ్యాల్లో అగ్ని జ్వాలగా లేచిన గిరిజన మహావీ రుడు భగవాన్ బిర్సాముండా అని పాలమూరు విభాగ్ హాస్టల్స్ కన్వీన ర్‌సతీష్ అన్నారు. భగవాన్ బిర్సాముణ్డా 150వ జయంతి సందర్భంగా ఆయన బాలికల జూనియర్ కళాశాలలో సెమినార్ నిర్వహించి మాట్లా డారు. 1899లో బ్రిటిష్ పాలకుల అన్యాయానికి వ్యతిరేకంగా బిర్సాముండా ఉద్యమించారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మొక్తాల శంతన్, అర్జున్, అనిల్, రాము, అజయ్, సాయి పాల్గొన్నారు.



బిర్సాముండా జయంతిలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వసతులు కల్పించాలి

తిమ్మాజిపేట, (ఆంధ్రజ్యోతి) : కళాశాలలో విద్యార్థులకు వసతులు కల్పించాలని ఏబీవీపీ మండల కన్వీనర్ వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఏబీవీపీ నాయకులు పరిసరాలను పరిశీలించి తహసీల్దార్ రామకృష్ణయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు.

పద్మభూషణ్ కృష్ణకు ఘన నివాళి

కొల్లాపూర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సినీ పరిశ్ర మలో సూపర్‌స్టార్, పద్మభూషణ్ అ వార్డు గ్రహీత దివంగత ఘట్టమ నేని కృష్ణ 3వ వర్ధంతి వేడుకలను కొల్లాపూర్ పట్టణంలోని ఘట్టమనేని కృష్ణ, ప్రిన్స్ మహేష్‌బాబు అభిమానుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి అభిమానులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమలో పద్మాలయ స్టూడియో ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు. పట్టణంలో పేదలకు పండ్లు, బ్రెడ్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో సూపర్‌స్టార్ కృష్ణ అభిమానులు కమలాకర్‌రావు, చాపల రాజు, షాబద్దీన్, ఆనందొశెట్టి, జగతి నాయుడు శ్రీనివాసులు కృష్ణారెడ్డి, ప్రిన్స్ మహేష్ బాబు, అభిమాన సం ఘం అధ్యక్షుడు చిన్న ఉపాధ్యక్షులు పండు, కోశాధికారి విక్రం మజహర్ పాల్గొన్నారు.



కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

జటప్రోలులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

పెంట్లవెల్లి నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జటప్రోలు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు సింగోటి కోరారు. శనివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సీఈవో వెంకట్‌నర్సుకు వినతిపత్రం అందజేశారు. పెంట్లవెల్లి మండల కేంద్రానికి ఒక్కటే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని, జటప్రోలు నుంచి పెంట్లవెల్లికి మొక్కజొన్నలను తీసుకురావాలంటే రైతులకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. జటప్రోలులో మరో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు హనుమంతు, కురుమయ్య, చిన్న బాలయ్య, పెద్ద నరసింహ కోరారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతికి ఎమ్మెల్యే నివాళి

బిజినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మమ్మాయిపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు తమ్మడి బన్నయ్య శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి శనివారం ఉదయం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి బన్నయ్య మృతదేహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

● మమ్మాయిపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ బన్నయ్య మృతి చెందిన విషయం తెలుసుకొని హైదరాబాద్‌లో ఉంటున్న అదే గ్రామానికి చెందిన ఏటవాలి రాజవర్ధన్ రెడ్డి గ్రామానికి వచ్చి బన్నయ్య మృతదేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు.

ఆర్నెళ్ల నుంచి భాషా పండితుల కొరత

- ఉడిమిల్ల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు

- జూన్ నుంచి బోధించని తెలుగు, హిందీ, ఇంగ్లిషు పాఠ్యాంశాలు

పదర, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని ఏజెన్సీ ప్రాంతమైన పదర మండలం ఉడిమిల్ల గ్రామంలో గల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలలో భాషా పండితులు లేరు. అందులో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 120 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం (6నెలల) నుంచి నేటి వరకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించేందుకు భాషా పండితులు లేరు. ముఖ్యంగా 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థినులకు ఆయా భాషల్లో కనీస అవగాహన లేకుండా పోయింది. ఈ విషయమై పాలకులతో పాటు, ఉన్నత స్థాయి అధికారులకు తెలిసినా ప్రయోజనం లేదు. ముఖ్యంగా బోర్డు పరీక్షలను దృష్టిలో పెట్టుకుని పదవ తరగతి విద్యార్థుల పరిస్థితిని ఆలోచిస్తే వ్యవస్థ లోపం తేటతెల్లమవుతుంది. పది రోజుల క్రితమే హెచ్‌ఎంగా శోభ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సమస్య ఐదారు నెలల క్రితం నుంచే ఉందనేది ఏటీడీఓ, డీటీడీఓలకు తెలిసిందే. పాలకులు,అధికారులు చొరవ చూపి గిరిజన బాలిక విద్యార్థులకు భాషా పండితులను నియమించి న్యాయం చేరూర్చే ప్రయత్నం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదే విషయంపై డీటీడీఓ ఫిరంగిని ఫోన్‌లో వివరణ కోరగా భాషా పండితులు లేనిది వాస్తవమేనని అన్నారు. ప్రస్తుతం సీఆర్‌టీల విషయం కోర్టు కేసులో ఉంది. మిగతా స్కూళ్లలో ఉన్నవారిని పరిగణలోకి తీసుకుని పరిశీలించి ఈ పాఠశాలకు షిఫ్ట్ చేసేలా చూస్తాం.



ఉడిమిల్ల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల